సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 14 । నవంబర్ । 2023



కౌంటింగ్ కేంద్రం పరిశీలన
రామగిరి: జేఎన్టీయూ కాలేజీలో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా సోమవారం పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ శ్రీనివాసరావు తదితరులున్నారు.



46వ వసంతంలోకి ఎన్టీపీసీ
దేశానికి ఎన్టీపీసీ వెలుగులు పంచుతూ రాష్ట్రంలో అతిపెద్ద విద్యుత్ హబ్‌గా నిలిచింది. విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తూ 46వ వసంతంలోకి అడుగిడుతోంది.

లోపలి పేజీలో ▸

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. అతవేగంగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ రెమారాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల పక్రియ, పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలని రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం రామగుండం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల స్ట్రాంగ్ రూం, సెక్యూరిటీ లాగ్‌బుక్ పరిశీలించారు. రిటర్నింగ్ కార్యాలయం పరిసరాలు తనిఖీ చేశారు. భద్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు. సీపీ వెంట రిటర్నింగ్ ఆఫీసర్ జె.అరుణశ్రీ, ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎన్టీపీసీ ఎస్సై జీవన్, వన్‌టౌన్ ఎస్సై శరణ్య, మీడియా అండ్ కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజని తదితరులున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న రాజేశ్‌సింగ్‌రాణా


గోదావరిఖని(రామగుండం): పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా ఆదేశించారు. సోమవారం రామగుండం నియోజవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసి, వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాల్లోని లోపలి, బయటి గోడలపై ఉన్న స్కూల్ సంబంధిత పెయింటింగ్ చిత్రాలను పరిశీలించి, ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు కనబడకుండా కవర్ చేయాలని ఆదేశించారు. ఎపిక్ కార్డుల పంపకాల తీరు, కొత్త ఎపిక్‌కార్డు హోల్డర్లకు ఏ రకంగా పంపిణీ చేస్తున్నారో బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ పరిధిలో ఆరుకుపైగా పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలు, మెడికల్ క్యాంప్, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

రాకుమారకు జాతీయస్థాయి బహుమతి



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన ప్రముఖ రచయిత, కవి, సాహితీవేత్త రాకుమార రాసిన 'వసివాడుతున్న పసితనం' కవిత జాతీయస్థాయి బహుమతికి ఎంపికయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన డాక్టర్ పట్టాభి కళాపీఠం 11వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల జాతీయస్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది కవులు వివిధ కవితలను పంపించారు. కాగా రాకుమార రాసిన 'వసివాడుతున్న పసితనం' కవిత జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైనట్లు డాక్టర్ పట్టాభి కళాపీఠం వ్యవస్థాపకుడు తూములూరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 24న గుంటూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాకుమారకు బహుమతి అందజేయనున్నట్లు తెలిపా రు. కాగా, రామకుమార ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయస్థాయి వచన, గేయ, పద్య కవితల పో టీల్లో 67 వరకు బహుమతులు సాధించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు అభినందించారు.

ఆర్‌వో కార్యాలయం సమీపంలో దుకాణాల మూసివేత



మూసి ఉన్న దుకాణాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయ సమీపంలోని దుకాణాలను పోలీసు అధికారులు మూసివేయించారు. సోమవారం నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ సమయంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులపై ఫిర్యాదులందడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పోలీసు బలగాలు పెద్దఎత్తున మోహరించడంతో పాటు సమీపంలోని దుకాణాలను మూసివేయించారు. అయితే ఎన్నికల పుణ్యమా అని తమ వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతుందంటూ పలువురు వ్యాపారులు వాపోయారు.

65 నామినేషన్ల తిరస్కరణ

- 261 మంది అభ్యర్థులవి ఓకే
- ప్రముఖ నేతల కుటుంబసభ్యులవీ రిజెక్ట్
- ప్రధాన పార్టీల అభ్యర్థులంతా భద్రమే
- స్వతంత్రులుగా గంగుల రజిత, ఆది వనజ
- 15 వరకు ఉపసంహరణకు అవకాశం



పెద్దపల్లి ఆర్‌వో కార్యాలయంలో నామినేషన్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పరిశీలన సోమవారం ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 65 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బీఫాంలు సమర్పించలేదని కొందరివి, తక్కువ మంది ప్రతిపాదించారని మరికొందరివి, సంతకాలు చేయకపోవడంతో ఇంకొందరివి రిజెక్ట్ చేసినట్లు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 261 మంది వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల, స్వతంతుల నామినేషన్లు ఆమోదం పొందాయి. కాగా, ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు సేఫ్..

ఉమ్మడి జిల్లాలో అధికార బీఆర్‌ఎస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఇవి కాకుండా బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ, పలు చిన్న పార్టీల నాయకులు, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి ఈసారి బరిలో ఉన్నవారిలో మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉన్నారు. ప్రస్తుతానికి వీరిలో ఎవరి నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. కానీ, ముందు జాగ్రత్తగా వారికి డమ్మీగా వేసిన బంధువులు, కుటుంబసభ్యులవి రిజెక్ట్ అయ్యాయి.

తిరస్కరణకు గురైంది వీరే..

హుజూరాబాద్ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్ సతీమణి జమున బీజేపీ నుంచి, కోరుట్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తన కుమారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కి మద్దతుగా, మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, మంథని నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు సతీమణి శైలజ, మంథని నుంచే బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి సతీమణి సుజాత నామినేషన్ వేశారు. బీఫాం ఇవ్వలేదన్న కారణంతో వీరందరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన సతీమణి వనజ నామినేషన్ వేశారు. ఈమె కాంగ్రెస్ తరఫున బీఫాం ఇవ్వకపోవడంతో రిజెక్ట్ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను ఓకే చేశారు. కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత వేసిన నామినేషన్‌ను అధికారులు ఆమోదించారు. ప్రస్తుతానికి ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వీరిద్దరూ మంగళ, బుధవారాల్లో నామినేషన్ ఉపసంహరించుకోనున్నారు.

ఉత్కంఠ రేపిన ఫిర్యాదులు

- పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి సీహెచ్.విజయరమణారావు విదేశీ ఆస్తులు, ఇక్కడ ఐటీ రిటర్నుల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు వచ్చింది. అయితే, సంతృప్తికర వివరణతో ఈ ఫిర్యాదును ఆర్‌వో డిస్పోజ్ చేశారు.
- మానకొండూరులో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నా వాటిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదు.
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ కేసుల విషయమై ఆర్‌వోకు ఫిర్యాదు వచ్చింది. చివరకు ఆయన నామినేషన్‌ను అధికారులు ఓకే చేశారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

తిరస్కరించిన నామినేషన్లు : కరీంనగర్‌లో 7, చొప్పదండిలో 1, మానకొండూర్‌లో 7, పెద్దపల్లిలో 5, మంథనిలో 4, రామగుండంలో 5, జగిత్యాలలో 2, కోరుట్లలో 5, ధర్మపురిలో 19, హుజూరాబాద్‌లో 8, సిరిసిల్ల 0, వేములవాడలో 2.

ఆమోదం పొందినవి : కరీంనగర్‌లో 31, చొప్పదండిలో 17, మానకొండూర్‌లో 13, పెద్దపల్లిలో 25, మంథనిలో 24, రామగుండంలో 26, జగిత్యాలలో 19, కోరుట్లలో 20, ధర్మపురిలో 18, హుజూరాబాద్‌లో 25, సిరిసిల్లలో 23, వేములవాడలో 20.

తమ్మి.. తప్పుకోరాదె..!

- నామినేషన్ల ఉపసంహరణకు నాయకుల బేరసారాలు
- 15 మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలు వాడాల్సిందే
- రెండు వాడితే ఓటర్లు తికమకపడే అవకాశం
- 'అన్నిరకాల' ప్రయత్నాలు చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- రేపు తేలనున్న అభ్యర్థుల లెక్క



'అన్న.. తమ్మి.. నామినేషన్ వేశావు.. ఈ పదిహేను రోజుల్లో ప్రచారం చేసి గెలిచేది లేదు.. నీవు ఏ ఉద్దేశంతో నామినేషన్ వేశావో, ఆ సమస్య అందరికీ తెలిసింది. ఇగ తప్పుకో.. ఇప్పటి వరకు నీవు చేసిన ఖర్చుకు డబుల్ ఇస్తా. లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నీకు టిక్కెట్ ఇప్పించే బాధ్యత నాది. లేకపోతే రెండు ఈవీఎంలు వాడాల్సి వస్తుంది. అసలే మన నియోజకవర్గంలో గ్రామీణ ఓటర్లు ఎక్కువ. ముసలోళ్లు, సదువురానోళ్లు ఈవీఎంలో నాపార్టీ 'గుర్తు'ను గుర్తించేందుకు తికమకపడుతారు. దీంతో ఓట్లు చీలే అవకాశం ఉంది తమ్మి'.. అంటూ ప్రధాన పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులతో మంతనాలు సాగిస్తూ.. వారు నామినేషన్లు ఉపసంహరించుకునేలా 'అన్నిరకాల' ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ప్రయత్నాలు ఏ మేరకు ఫలించనున్నాయో బుధవారం తేలనుంది.

సాక్షి,పెద్దపల్లి: ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని పార్టీల నాయకులు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఏ ఒక్క చిన్న విషయాన్ని వదలకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఈవీఎంలో 16 గుర్తులు ఉండగా, అందులో చివరిది నోటాకు కేటాయిస్తారు. దీంతో ఎన్నికల బరిలో 15 మందికి మించితే రెండో ఈవీఎంను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో పోలింగ్ రోజు ఓటర్లు తికమకపడే అవకాశం ఉంటుంది. అలాగే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో డమ్మీ ఈవీఎంలు చూపి ఓటర్లకు వివరించడంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈక్రమంలో ఎన్నికల బరిలో 15మంది అభ్యర్థుల లోపే ఉండేలా తెర వెనుకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తికాగా, సోమవారం రిటర్నింగ్ అధికారులు పరిశీలన చేసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 నియోజకవర్గాల్లో 261 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లయింది. నామినేషన్ల ఉపసంహరణ బుధవారంతో పూర్తి కానుంది. ఈనేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు స్వతంత్ర అభ్యర్థులకు తాయిలాలు చూపి పోటీనుంచి తప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో పలువురి నామినేషన్ల తిరస్కరణ

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం అసెంబ్లీ పరిధిలో 31 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూట్నీలో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో అక్కడ 11మంది అభ్యర్థులు నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంది. అలాగే మంథనిలో 28 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, పరిశీలనలో నలుగురివి తిరస్కరించడంతో 24మంది మిగిలారు. వీరిలో 9మంది తమ నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలి. లేకుంటే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి వస్తుంది. పెద్దపల్లిలో 30మంది నామినేషన్లు వేయగా, 5 తిరస్కరణతో 25మంది బరిలో నిలిచారు. ఒక్కటే ఈవీఎం ఉపయోగించాలంటే పెద్దపల్లి బరిలో 10 మంది తప్పుకోవాల్సి ఉంది.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



బహుమతులు అందజేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఉమ్మడి కరీంనగర్ అండర్–14 జిల్లాస్థాయి బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలను సోమవారం స్థానిక స్పందన మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర విభాగంలో పెద్దపల్లి, బాలికల విభాగంలో కరీంనగర్ జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–1 బేస్‌వర్క్‌షాప్ హెచ్‌వోడీ నజీర్, సెస్టోబాల్ సౌత్ జోన్ చైర్మన్ జక్కుల దామోదర్‌రావు ట్రోఫీలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. అనంతరం ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడకారులు ఈనెల 17న జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పెద్దపల్లి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ పాఠశాల హెచ్ఎం సుందర్‌రావు, సంతోష్‌కుమార్, కరీంనగర్ జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్, పీఈటీలు ఓదెలుయాదవ్, శంకరయ్య, రవికుమార్, సత్యనారాయణ, జాఫర్, ముఖేశ్‌కుమార్, సోమశేఖర్, చంద్రశేఖర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం.. వీవీప్యాట్ ఎప్పుడు వచ్చాయంటే..



మీకు తెలుసా..!

పెద్దపల్లిరూరల్: మనదేశంలో ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో బ్యాలెట్ పేపర్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాలను (ఈవీఎం) అందుబాటులోకి తెచ్చారు. దేశంలోనే తొలిసారిగా 1982 మే19న కేరళ రాష్ట్రంలోని పరూర్ నియోజకవర్గంలో వినియోగించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని షాద్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలతో పాటు 1982, 83లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈవీఎంలను వాడారు. అయితే వాటి పనితీరుపై రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపగా కొంతకాలం నిలిపివేశారు. ఆ తర్వాత 1999, 2004లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి ఈవీఎంలను వినియోగిస్తున్నారు. అయితే తాము ఎవరికి ఓటు వేశామో ఓటరు తెలుసుకునేందుకు వీలుగా 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీప్యాట్‌ను (ఓటర్ వెరిఫియేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) అనుసంధానించారు. దీంతో ఓటర్లు తాము ఓటు వేయాలనుకునే వారికే వేశామా లేదా అని నిర్ధారించుకునేందుకు వీలుకలిగింది.

తుది దశకు 'సీఎన్‌జీ' పనులు



ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ స్టేషన్, మీటర్ (ఇన్‌సెట్‌లో)

- ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి పైప్‌లైన్ ద్వారా గ్యాస్
- తొలిదశలో రామగుండం గౌతమినగర్‌లో ఇంటింటా సరఫరాకు ఏర్పాట్లు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ముంబయ్, అహ్మదాబాద్, ఢిల్లీ లాంటి నగరాల తరహాలో తెలంగాణలో తొలిసారిగా ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా సీఎన్‌జీ (కాంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) గ్యాస్ సరఫరాకు తొలిఅడుగు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలోని గ్యాస్ స్టేషన్ నుంచి ఉమ్మడి కరీంనగర్‌లోని ప్రతీ ఇంటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. తొలిదశలో పెద్దపెల్లి జిల్లాలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లోని గౌతమినగర్, శాంతినగర్‌లో సరఫరాకు పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్, సింగరేణి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, శాంతినగర్, గౌతమినగర్‌లో గ్యాస్ కనెక్షన్ కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వినియోగదారులకు రూ.618తో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించింది. ఫీజు చెల్లించిన వినియోగదారులకు గ్యాస్ మీటర్లు బిగించారు.

ఎల్‌పీజీతో పోలిస్తే 30శాతం తక్కువ

ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌తో పోలిస్తే పైప్ లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ ధర 20 నుంచి 30 శాతం మేర తక్కువగా ఉండనుంది. పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ బరువు తక్కువగా ఉండటంతో లీకేజీలు, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. మీటర్ బిగించి యూనిట్ల ఆధారంగా బిల్లులు వసూలు చేయనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇన్వర్టర్లు, జనరేటర్లే దిక్కు



నాగారంలో పంట పొలాల సందర్శనలో పుట్ట మధు, నాయకులు

- బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇన్వర్టర్లు, జనరేటర్లే దిక్కని బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పేర్కొన్నారు. 24గంటల కరెంట్ సరఫరాపై మంథని మండలం నాగారంలో రైతులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, ఐటీపరంగా, వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ముందుకు తీసుకెళ్తుంటే కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. కర్ణాటక రాష్ట్రంలో పది గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం 5 గంటలు కూడా సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. కాంగ్రెస్ వేళాపాల లేని కరెంటు కావాలో బీఆర్‌ఎస్ సర్కార్ ఇచ్చే 24 గంటల కరెంటు కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు.

మీ గెలుపే మా భవిష్యత్‌కు భరోసా

'మా ఆకలి తీర్చి చదువుకు ఆటంకం లేకుండా చేశారని, మీ రుణం ఎలా తీర్చుకోవాలి?' అంటూ మహాముత్తారం మండలానికి చెందిన పలువురు విద్యార్థులు పుట్ట మధును కొనియాడారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలల్లో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచిత మధ్యాహ్న భోజనం కల్పించగా, పలువురు విద్యార్థులు మధును మర్యాదపూర్వకంగా కలిశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతిపేద బిడ్డ ఉన్నత చదువుకు భరోసా కల్పిస్తానని, హైదరాబాద్‌లో రెండు హాస్టళ్లు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పిస్తానని వారికి విద్యార్థులకు ఇచ్చారు.



ముత్తారంలో మాట్లాడుతున్న పుట్ట మధు

అబద్ధాల గ్యారంటీలను నమ్మవద్దు

ముత్తారం(మంథని): అబద్ధాల ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌ను నమ్మవద్దని పుట్ట మధు పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ధర్యపూర్, హరిపురం, పోతారంలో ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో పాటు తమ సొంత మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ స్వర్ణలతఅశోక్, మండల సర్పంచుల కన్వీనర్ నూనె కుమార్, సర్పంచులు గాదం స్రవంతి శ్రీనివాస్, వేల్పూరి సంపత్‌రావు, నెత్తెట్ల మహేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పోలింగ్ జరిగేలా చూడాలి

- ఎన్నికల పరిశీలకుడు శ్రీధర్‌గౌడ

కమాన్‌పూర్/రామగిరి/పాలకుర్తి: కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎన్నికల పరిశీలకుడు శ్రీధర్‌గౌడ సందర్శించారు. వందశాతం పోలింగ్ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆదివరహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దార్ మోహన్‌రెడ్డి, గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై రాములు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్య ఉన్నారు. అనంతరం రామగిరి మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలను శ్రీధర్‌గౌడ్ పరిశీలించారు. వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాంచందర్‌రావు, ఎస్సై రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండలం కన్నాల, రాణాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎన్నికల పరిశీలకుడు సీఎస్ శ్రీధర్‌గౌడ పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతి, పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్, బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



కమాన్‌పూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు శ్రీధర్‌గౌడ

క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

మెట్‌పల్లి: రెడ్డి కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వారి నుంచి రూ.6.50లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


ముస్తాక్(ఫైల్)

కోరుట్లరూరల్: చిన్న మెట్‌పల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మహమ్మద్ ముస్తాక్ (30) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమవారం తను కౌలుకు చేసే పొలంలో కింద పడి ఉన్న విద్యుత్ తీగను చుడుతుండగా.. ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై నవీన్‌కుమార్

మల్లాపూర్: సిరిపూర్ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం చేపట్టిన పోలీసుల వాహనాల తనిఖీల్లో బైక్‌పై తరలిస్తున్న రూ.1.14 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు చేస్తుండగా.. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి రూ.1.14 లక్షలను స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్‌సెల్‌కి అప్పగించినట్లు వివరించారు. పోలీస్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని సైదాబాద్‌కు చెందిన కోడెం శ్రీనివాస్‌కు గోదావరిఖనికి చెందిన సువర్ణ(35)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులిద్దరూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళి నోము ఉందని శనివారం రాత్రి దంపతులు హైదరాబాద్ నుంచి బైక్‌పై సైదాబాద్ వస్తున్నారు. జమ్మికుంట పట్టణ శివారులోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పడంతో సువర్ణ కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్ అజాగ్రత్తగా బైక్ నడపడం వల్లే సువర్ణ మృతి చెందిందని ఆమె సోదరుడు పోరండ్ల భీంరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

గోదావరిఖని(రామగుండం): స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుంటపల్లిలో సోమవారం ఒకరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈసంఘటనలో మేకల హరికృష్ణకు తీవ్రగాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుటుంబ కారణాలవల్లే గొడవ జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

- నియోజకవర్గాల్లో ప్రైవేటు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- 'సాక్షి'తో కొత్తగా ఓటు హక్కు పొందిన యువత


నూతనంగా ఓటు హక్కు పొందిన యువత

సాక్షి పీపుల్స్ ఎజెండా

కమాన్‌పూర్(మంథని): ప్రభుత్వాలు మారుతున్నా ప్రభుత్వ రంగ సంస్థల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడం లేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇదిగో అదిగో ఖాళీలు భర్తీ చేస్తామంటూ ప్రకటనలకే పరిమితమవుతున్నారు. రాష్ట్ర రాజధానిలో కాకుండా నియోజకవర్గాల్లో పరిశ్రమలు విస్తరించడంలో పాలకులు విఫలమవుతున్నారు. పరిశ్రమలు అందుబాటులో లేక గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించే దిశగా అధికారంలోకి వచ్చే పాలకులు చిత్తశుద్ధితో ఆలోచన చేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు మార్గం చూపించాల్సిన బాధ్యత పాలకులదేనని కొత్తగా ఓటు హక్కు పొందిన యువత 'సాక్షి'తో తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

బాధ్యతగా వేస్తా



నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. ఓటేయడాన్ని బాధ్యతగా తీసుకుంటా. ప్రజాసామ్య దేశంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరికి కల్పించిన రాజ్యాంగపరమైన హక్కుగా గుర్తించి ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

– పిడుగు అంజలి, కమాన్‌పూర్

అమ్ముకోవద్దు



ప్రజాస్వామ్యంలో ఓటు అనే వజ్రాయుధాన్ని అమ్ముకోవద్దు. ప్రజలకు సేవ చేసే నిస్వార్థ నాయకుడిని ఎన్నుకోవాలి. విద్య, వైద్య, వ్యవసాయ సంక్షేమానికి కృషి చేసేవారికి ఓటేస్తా.

– కాసు ఆదిత్య సూర్యప్రకాశ్, బీటెక్, ముత్తారం

సంతోషంగా ఉంది



మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. మొదటిసారిగా ఓటు వేయబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులకు ఇంటర్ నుంచి డిగ్రీ వరకు రిజర్వేషన్ లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసే వారికే ఓటేస్తా.

– శ్రీవీరా, యైటింక్లయిన్‌కాలనీ

అవకాశాలు కల్పించేవారికే ఓటు



నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే పార్టీకి ఓటేస్తా. ఉద్యోగాలు లేక ఎంతోమంది విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు.

– మేరుగు గాయత్రి సిరి, జూలపల్లి

ప్రజాస్వామ్యంలో కీలకం



ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు దోహదపడుతుందని భావిస్తున్నా. పార్టీల కంటే వ్యక్తిగతంగా ముఖ్యం. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తూ అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవాలి.

– దూదం శ్రీసీజా, సుల్తానాబాద్

అవినీతికి పాల్పడని వారికే ఓటు



ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమైనది. ఓటును డబ్బులకు అమ్ముకోవద్దు. అవినీతికి పాల్పడనివారికి ఓటేస్తా. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

– స్వాతికహృదయ్, లొంకకేసారం, రామగిరి మండలం

అందుబాటులోకి తీసుకురావాలి



ఇక్కడి యువత ఉద్యోగ అవకాశాల్లేక ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఐటీ సంస్థలను అందుబాటులోకి తీసుకురావాలి.

– పిట్టల గణేశ్, గుండారం, కమాన్‌పూర్ మండలం

బొగ్గుబాయి

బొగ్గు తరలిస్తున్న లారీ పట్టివేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారులో బొగ్గును అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొని సింగరేణి కాంట్రాక్టర్ నరసింగరావు, డ్రైవర్ కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. గోదావరిఖని 11బొగ్గు గని నుంచి రాఘవాపూర్ రైల్వే స్టేషన్‌కు బొగ్గును తరలించాల్సిన కాంట్రాక్టర్ నర్సింగరావు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. రంగంపల్లి వద్ద సింగరేణి సెక్యూరిటీ జూనియర్ ఇన్స్‌పెక్టర్ ఉమేశ్, ఇతర సిబ్బంది పట్టుకున్నారన్నారు.

దిక్కులేని వారిని చేసి వెళ్లిపోయావా..

- ఉపాధివేటలో పోయిన ఊపిరి
- యువకుడి మృతితో రోడ్డున పడ్డ కుటుంబం
- బండపల్లిలో విషాదం
- విరాళాలు అందిస్తున్న యువకులు


బాబు(ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చందుర్తి(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఎడారి దేశానికి వెళ్లిన యువకుడి శవమై ఇంటికి తిరిగొచ్చాడు. యువకుడి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారు. మండలంలోని బండపల్లికి చెందిన రేగుల బాబు(39) గత డిసెంబర్‌లో జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. ఇరువై రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. అక్కడ వైద్యం చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. రెండు, మూడు రోజుల్లో ఇంటికొస్తానని భార్యకు వారం క్రితం ఫోన్ చేసి చెప్పాడు. పరిస్థితి విషమించి బాబు శుక్రవారం మృతి చెందాడు. ఈ అతని స్నేహితులు ఫోన్ ద్వారా బాబు భార్య కల్యాణికి ఫోన్‌లో తెలపడంతో ఆమె గుండెలవిసేలా రోదించింది. బాబు శవపేటిక సోమవారం బండపల్లికి చేరింది. తండ్రి శవాన్ని చూసి కూతురు, కుమారుడు, భార్య రోదించిన తీరు అందరిని కన్నీరు పెట్టించింది.

చిన్ననాటి నుంచి కష్టాలే..

బాబు చిన్నతనంలోనే తండ్రి లచ్చయ్య మృతి చెందడంతో తల్లి లచ్చవ్వ గ్రామంలో చిన్న హోటల్ నడిపిస్తూ కుమారుడిని పోషించింది. బాబు పదోతరగతి చదువుతుండగా తల్లి అనారోగ్యంతో చనిపోయింది. ఒంటరిగా జీవిస్తున్న బాబు బంధువులు పెళ్లి చేశారు. స్వగ్రామంలో చిన్నాచితక పనులు చేసుకునేవాడు. ఇటీవల అప్పు చేసి కువైట్‌కు వెళ్లాడు. అక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో జ్వరంబారిన పడి గత శుక్రవారం మృతిచెందాడు.

ముందుకొచ్చిన యువకులు

బాబు కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ యువకులు ముందుకొచ్చారు. మృతుడికి పదమూడేళ్ల కూతురు రష్మిత ఉంది. ఆమె చదువుల కోసం యువకులు రూ.50వేలు జమచేశారు. మరింత మొత్తం జమచేసి అందజేసేందుకు యువకులు ప్రయత్నిస్తున్నారు.

అనుకున్నదొక్కటి..

జంగ్ తెలంగాణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బీజేపీ అభ్యర్థిత్వం మా సారుకే వస్తదంటే.. మా నేతకే ఇస్తున్నట్టు చెప్పింద్రు అంటూ పార్టీలో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న నేతల అనుచరులు ఎవరికి వారే చెప్పుకున్నరు. మరో నాయకుడు కొంతకాలం క్రితమే మరో ముఖ్య నేతతో కలసి చేరి టికెట్ కోసం తనవంతు యత్నాలు చేశారు. తొలి జాబితాలో తన పేరు వస్తుందంటూ ఆయన అనుచరులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. వాళ్లకు కాదు.. మాలో ఎవరికైనా పెద్దపల్లి నుంచి పోటీ చేసే అవకాశమిస్తేనే కాషాయ కండువా కప్పుకుంటామంటూ మరో ఇద్దరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పోటీ పడ్డారు. పెద్దపల్లి సీటు కేటాయింపుపై సమాలోచనల్లో భాగంగా పెద్దపల్లి టికెట్ ఆశిస్తున్న సీనియర్ నాయకుడితో ఫోన్‌లో రాష్ట్ర ఇన్‌చార్జి, కేంద్ర మంత్రి మాట్లాడడంతో టికెట్ నాకే వచ్చింది.. పాత విషయాలన్నీ మర్చిపోయి ఈ ఎన్నికల్లో అందరం కలసి పని చేద్దామంటూ ప్రత్యర్థి వర్గీయుల్లో ఉన్న వారితోనూ మాట్లాడానని సదరు నేత మనోవేదనకు గురవుతున్నారట. పెద్దపల్లికి చెందిన యువ నాయకుడు రాష్ట్ర స్థాయి నేత టికెట్ ఇప్పిస్తానంటూ హామీ ఇచ్చాడంటూ ప్రచార రథాన్నే సిద్ధం చేసుకున్నాడు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల్లో చాలాకాలంగా ఉంటున్న ఈ నియోజకవర్గానికి చెందిన మరో నాయకుడు తనకు పార్టీ అభ్యర్థిత్వం ఖరారైందని చెప్పడంతో ఆయన అనుచరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇలా ఎవరికి వారు తమ నేతకు టికెట్ వస్తుందని ఆశగా ఎదురుచూశారు. పార్టీ అధిష్టానం మాత్రం నామినేషన్ వేసే ఆఖరు రోజున ఆలయంలో పూజలు చేసిన ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు టికెట్ కేటాయించగా.. ఆయన తన నామినేషన్ కూడా పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆఖరుగా దాఖలు చేశారు. కాగా తనకు టికెట్ వచ్చిందని చెప్పి.. ప్రత్యర్థి వర్గీయుడికి టికెట్ కేటాయించడంతో ఆ నేతతో పాటు ఆయన వర్గీయులు గుర్రుగా ఉండి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు పెద్దపల్లిలో మంగళవారం సమావేశమవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

‘చంద్రన్నను ప్రజలు నమ్మొద్దు’

మంథని/ముత్తారం: ముత్తారం మండలం మచ్చుపేటకు చెందిన బందారపు మల్లయ్య అలియాస్ చంద్రన్న సీపీఐ మావోయిస్టు పార్టీ నుంచి డబ్బులు ఎత్తుకొచ్చాడని, అతడిని విప్లవ ప్రజలు, అమరవీరుల కుటుంబాలు నమ్మొద్దని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 1986–87లో గత పీపుల్స్ వార్ పార్టీలో రిక్రూమెంట్ అయిన చంద్రన్న మంథని ఏరియాలో దళ సభ్యుడి నుంచి కమాండర్, జిల్లా కమిటీ మెంబరుగా పని చేశాడని, మంథని ఏరియాలో పని చేసే క్రమంలో జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించాడన్నారు. మచ్చుపేట గ్రామంలో కామ్రేడ్స్ గట్టన్న, అమృతక్కతో పాటు దాదాపు ఎనిమిది మంది కామ్రేడ్స్ వారి ఆశయ సాధనలో అమరులయ్యారని, ఉద్యమ అవసరాలరీత్యా 2003లో దండకారణ్యానికి బదిలీ అయిన చంద్రన్న.. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జిల్లా కమిటీ మెంబర్, కార్యదర్శిగా నిబద్ధతతో పని చేశాడని వివరించారు. ఉద్యమంలో ఎగుడుదిగుడులు, మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోలేకపోయాడని, నిర్బంధం పెరిగి దాడులు జరగడంతో ప్రాణ భయంతో ప్రజలకు ద్రోహం చేసి డబ్బులు ఎత్తుకొని పారిపోయాడని పేర్కొన్నారు. కాగా ఎన్నికల నేపథ్యంలోనే చంద్రన్నపై మావోయిస్టు ప్రకటన విడుదలయినట్లు తెలుస్తోంది.

మద్యం దుకాణాలపై కేసు


కేసు నమోదు చేస్తున్న సీఐ రమేశ్

గోదావరిఖని: ఎన్నికల కమిషన్‌కు సకాలంలో సేల్స్ వివరాలందించని రెండు మద్యం దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ తెలిపారు. ఎన్నికల కమిషన్‌కు ప్రతిరోజు రాత్రి 11 గంటల్లోపు ఆయా బ్రాందీషాపుల సేల్స్ వివరాలు పెట్టాలని అన్ని షాపులకు చెప్పినా.. యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. స్టాక్ రిజిస్టర్లు అందుబాటులో లేని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తెలంగాణ వైన్స్, గోదావరిఖని మార్కెట్ వద్ద గల దుర్గావైన్స్‌పై నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ అకౌంట్ రిజిస్టర్ కేసు నమోదు చేసి రూ.15 వేల చొప్పున జరిమానా విధించామన్నారు.

మద్యం పట్టివేత


నిందితుడితో సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలో బైక్‌పై వెళ్తున్న వేముల పెంటయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా.. హర్యాన రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు లభ్యమయ్యాయని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రంగంపల్లికి చెందిన పెంటయ్య ఢిల్లీ నుంచి కార్లు కొనుగోలు చేసి తెచ్చి ఈ ప్రాంతంలో అమ్ముతుంటాడని, తిరుగు పయనంలో హర్యాన మద్యం సీసాలను వెంట తెచ్చి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పెంటయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది శరత్‌బాబు, శ్రీనాథ్, కృష్ణ, మోజెస్, కార్తీక్‌రెడ్డి ఉన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్టు గుర్తిస్తే సెల్ నెంబరు 87126 58817కు సమాచారమందించాలన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి


వీర రాఘవమ్మ (ఫైల్)

రామగిరి: కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. భార్య మృతిచెందింది. కల్వచర్ల పంచాయతీ ప్రశాంత్‌నగర్‌లో ఉప్పులూరి వీర్రాజు, వీర రాఘవమ్మ(55) దంపతులు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీర్రాజు కొద్దికాలంగా మద్యానికి బానిస కావడంతో.. గొడవలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం వీర్రాజు మద్యం తాగి వీర రాఘవమ్మతో గొడవ పడడంతో.. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. అనంతరం వీర్రాజు తాగాడు. గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో భార్య వీర రాఘవమ్మ మృతిచెందింది. మెరుగైన చికిత్స కోసం వీర్రాజును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి ఇద్దరి కూతుళ్లకు వివాహమైంది. మృతురాలి కూతురు మద్దుకూరి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కటిక రవిప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్ అనుమల్ల శ్రీనివాస్(కోర్టు శ్రీను) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనారోగ్యంతో వేంపల్లి ఉప సర్పంచ్ మృతి


రాజనర్సయ్య (ఫైల్)

మల్లాపూర్: వేంపల్లి ఉప సర్పంచ్ వెల్మల రాజనర్సయ్య(55) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. రాజనర్సయ్య ఇటీవల అస్వస్థతకు గురవగా.. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాజనర్సయ్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. రాజనర్సయ్యకు భార్య గంగరాజు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు బిట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు


భీంరాజ్‌పల్లిలో టపాసులు కాల్చుతున్న చిన్నారులు

గొల్లపల్లి: దీపావళి పర్వదినాన్ని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో మహిళలు ప్రత్యేకంగా లక్ష్మీదేవి పూజలు, దంపతులు కేదారేశ్వర వత్రం నిర్వహించారు. సాయంత్రం వాకిళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి.. ప్రమిదలు వెలిగించి.. టపాసులు కాల్చి సందడి చేశారు. బాణసంచా విక్రయ దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. మంత్రి ఈశ్వర్ వేడుకల్లో పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మపురి: గిరిజన బోదరగూడెంకు చెందిన అద్దరి చిన్నన్న(80) బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడికి ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్యకు సంతానం కలగకపోవడంతో మరొకరిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్నన్న గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. చిన్నన్నకు అదే గ్రామానికి చెందిన కొందరితో గొడవలున్నాయి. గొడవల్లో చిన్నన్నకు అవమానం జరగగా.. అది భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న లారీ ఇదే..

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆదివారం కోరుట్ల వైపు నుంచి లారీలో తరలిస్తున్న 260 క్వింటాళ్ల బియ్యం మారుతినగర్ వద్ద పట్టుబడిందన్నారు. వీటి విలువ సుమారు రూ.5.20 లక్షలుంటుందని అన్నారు. లారీ యజమాని కోరుట్లకు చెందిన అహ్మద్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య


మోహన్ (ఫైల్)

మానకొండూర్: మండలంలోని కొండపలకలకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, సీఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. శ్రీరాముల మోహన్(33) తన నాయీబ్రాహ్మణ వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా విపరీతమైన వెన్ను నొప్పి వస్తుండటంతో ఆస్పత్రిలో చూపించుకొని, మందులు వాడుతున్నాడు. అయినా నొప్పి తగ్గడం లేదు. ఈ క్రమంలో దీపావళి పండుగ సందర్భంగా అతని భార్య రజని ఖాజీపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. మోహన్ సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో గల మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

శ్రీరాములపల్లెలో డీపీవో విచారణ


విచారణ చేపడుతున్న డీపీవో దేవరాజ్

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లెలో డీపీవో దేవరాజ్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కుడుకుల లావణ్య తన సొంత పట్టా భూమిలో ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శికి ఆర్నెళ్ల క్రితం దరఖాస్తు చేసుకుంది. కార్యదర్శి అనుమతి ఇవ్వకపోవడంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. బాధితురాలు తన డాక్యుమెంట్లు, ఇంటినిర్మాణ మ్యాప్, ఇతర పత్రాలను ఆయనకు చూపించారు. వాటితో ఆర్నెళ్ల క్రితం సమర్పించానని, అయినా అనుమతి ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నాడని వాపోయింది. తన భర్త ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉండగా. మహిళనని చూడకుండా నిత్యం జీపీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడని గోడు వెళ్లబోసుకుంది. ఆమె వాగ్మూలాన్ని రికార్డు చేసుకున్న డీపీవో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని పేర్కొన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని డీపీవో దేవరాజ్ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సురేష్‌రెడ్డి ఉన్నారు.